# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in  ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం  తెలుగు దిన పత్రిక

సంపుటి : 02  సంచిక : 118  క్రిష్ణా, శుక్రవారం 23 - 01 - 2026  పేజిలు : 4  వెల. 2 /-







## రథసప్తమి వేడుకల నేపథ్యంలో టీటీడీ కీలక నిర్ణయం




**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 22,** తిరుమల శ్రీవారి సన్నిధిలో ఈనెల 25న రథసప్తమి వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ బి.ఆర్.నాయుడు తెలిపారు. రథసప్తమి రోజున ఏడు వాహనసేవలపై మలయప్ప స్వామి భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. ఉదయం 5.30 గంటలకు సూర్యప్రభ వాహనంతో ప్రారంభమై.. రాత్రి 8 గంటలకు చంద్రప్రభ వాహన సేవతో వాహనసేవలు ముగుస్తాయన్నారు. రథసప్తమి వేడుకలకు దాదాపు రెండు లక్షల 50వేల మంది వస్తారని అంచనా వేశారు. ఈ రద్దీ దృష్ట్యా తిరుపతిలో 24 నుంచి 26 వరకు సర్వదర్శనం టోకెన్ల జారీ రద్దు చేసినట్లు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. మాడవీధుల్లో 3,700 మంది శ్రీవారి సేవకుల సాయంతో 14 రకాల వంటకాలతో భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. రథ సప్తమి రోజున శ్రీవారి ఆలయ నాలుగు మాడ వీధులు, క్యూలైన్లు, బయట ప్రాంతాల్లో నిరంతరాయంగా భక్తులకు అన్న ప్రసాదాలు అందించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు ఛైర్మన్ బీఆర్ నాయుడు. భద్రతకు పెద్ద పీట వేయాలని, టీటీడీ భద్రత విభాగం, జిల్లా పోలీసు యంత్రాంగం సమన్వయంతో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. 1,260 మంది పోలీసులు, 1200 మంది విజిలెన్స్ సిబ్బందితో భక్తులకు భద్రతా ఏర్పాటు చేశారు. ఆర్టీసీ బస్సుల ద్వారా 2,300 ట్రిపులు నడిచేలా ప్రణాళికలు రూపొందించారు. వాహనసేవల ముందు 56 కళా బృందాలతో ఆకట్టుకునేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తిరుమలలోని నాలుగు మాడవీధుల్లో టీటీడీ అధికారులతో కలిసి బీఆర్ నాయుడు తనిఖీలు చేశారు. రథసప్తమి వేడుకలకు వచ్చే భక్తుల సౌకర్యాలపై టీటీడీ, విజిలెన్స్ అధికారులతో చర్చించి, పలు సూచనలు చేశారు.

## ఏపీ మద్యం స్కామ్ కేసులో విజయసాయి రెడ్డి కి ముగిసిన ఈడీ విచారణ



**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 22,** ఏపీ మద్యం కుంభకోణం కేసులో మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి ఈడీ విచారణ ముగిసింది. హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయంలో అధికారులు ఆయనను గురువారం నాడు సుమారు 7 గంటల పాటు సుదీర్ఘంగా ప్రశ్నించారు. విచారణ అనంతరం ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేసుకుని పంపించారు. ఈడీ నోటీసుల మేరకు ఉదయం విచారణకు హాజరైన విజయసాయి రెడ్డిని అధికారులు పలు కోణాల్లో విచారించారు. గత ప్రభుత్వ మద్యం విధానం, విక్రయాలు, నిధుల మళ్లింపు, ఈ వ్యవహారంలో మధ్యవర్తుల పాత్ర వంటి కీలక అంశాలపై ప్రశ్నలు సంధించినట్లు సమాచారం. అధికారుల ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. అనంతరం ఆయన నుంచి వాంగ్మూలం తీసుకున్న అధికారులు విచారణ ముగించారు. గత వైసీపీ ప్రభుత్వంలో మద్యం లైసెన్సులు, డిస్ట్రిబ్యూషన్, విక్రయాల్లో భారీగా అవకతవకలు జరిగాయని, దీని ద్వారా సుమారు రూ. 3,500 కోట్లు చేతులు మారాయని ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆరోపణలపై సిట్ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేస్తోంది. ఈ కేసులో విజయసాయి రెడ్డి నిందితుడిగా ఉన్నారు. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ కుంభకోణంతో సంబంధం ఉన్న మరికొందరు నేతలు, మధ్యవర్తులపైనా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలతో ఏపీ రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

## నాలుగు రోజుల దావోస్ పర్యటన ముగించుకున్న సీఎం చంద్రబాబు



**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 22,** ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో తన నాలుగు రోజుల పర్యటనను విజయవంతంగా ముగించుకుని స్వదేశానికి బయల్దేరారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో పాల్గొన్న ఆయన, శుక్రవారం ఉదయం 8:25 గంటలకు హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా అమరావతికి పయనమై, ఉదయం 11:30 గంటల నుంచి సచివాలయంలో అధికారిక విధుల్లో పాల్గొననున్నారు. ఈ పర్యటన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అత్యంత ఫలవంతంగా సాగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. కేవలం మూడు రోజుల సమావేశాల ద్వారానే గ్రీన్ ఎనర్జీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వ్యవసాయం, టూరిజం వంటి కీలక రంగాల్లో సుమారు రూ. 2.50 లక్షల కోట్ల పెట్టుబడులు సాకారమయ్యాయని ఆయన వివరించారు. ఈ రంగాల్లో ఆంధ్రప్రదేశ్ సాధిస్తున్న ప్రగతిని, అందుబాటులో ఉన్న వనరులను ప్రపంచ వేదికపై సమర్థంగా వివరించగలిగామని తెలిపారు. గతంతో పోల్చుకుంటే ప్రపంచ దిగ్గజ సంస్థలు ఇప్పుడు భారత్ వైపు ఎంతో ఆసక్తిగా చూస్తున్నాయని, దేశంలోని యువశక్తి, సమర్థ నాయకత్వం, సానుకూల పాలసీలే ఇందుకు కారణమని ఆయన విశ్లేషించారు. తన పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు మొత్తం 36కు పైగా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆర్సెలర్ మిట్టల్ ఛైర్మన్ లక్ష్మీ మిట్టల్, గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్, ఐబీఎం సీఈఓ అర్వింద్ కృష్ణ వంటి 16 మందికి పైగా దిగ్గజ పారిశ్రామికవేత్తలతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇజ్రాయెల్, యూఏఈ, స్విట్జర్లాండ్ దేశాల ప్రతినిధులతోనూ భేటీ అయ్యారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం నిర్వహించిన 9కి పైగా సెషన్లలో పాల్గొని, ప్రపంచ పారిశ్రామిక రంగంలోని తాజా పోకడలను, పారిశ్రామికవేత్తల ఆలోచనలను తెలుసుకున్నారు. ఈ సదస్సు 'బ్రాండ్ ఆంధ్రప్రదేశ్'ను ప్రపంచానికి మరింత చేరువ చేసేందుకు, రాష్ట్రంలో అమలు చేస్తున్న విధానాలను అంచనా వేసేందుకు ఎంతగానో దోహదపడిందని ఆయన పేర్కొన్నారు. పర్యటనలో భాగంగా యూరప్‌లోని తెలుగు ప్రజలతోనూ చంద్రబాబు మమేకమయ్యారు. తెలుగు డయాస్పోరా కార్యక్రమంలో పాల్గొని వారిలో ఆత్మవిశ్వాసం నింపారు. దావోస్ వేదికగా పలు జాతీయ, అంతర్జాతీయ మీడియా సంస్థలకు ప్రత్యేక ఇంటర్వ్యూలు ఇచ్చి, రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలను, పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించారు

## 2035 నాటికి డే-జీరో రెడీ స్టేట్‌గా మారడమే లక్ష్యం



**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 22,** ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు వేదికగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తమ పారిశ్రామిక విధానంలో సరికొత్త అధ్యాయాన్ని ఆవిష్కరించింది. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' నుంచి 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' వైపు అడుగులు వేస్తున్నామని, పెట్టుబడులను వారాల వ్యవధిలోనే కార్యరూపంలోకి తెచ్చేలా 2035 నాటికి రాష్ట్రాన్ని 'డే-జీరో రెడీ స్టేట్'గా తీర్చిదిద్దడమే లక్ష్యమని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. నమ్మకం, వేగం అనే రెండు అంశాలు ఏపీని కీలక పెట్టుబడుల గమ్యస్థానంగా మారుస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. దావోస్‌లో జరిగిన 'ద ఫాస్ట్ లేన్: ఇన్వెస్టింగ్ ఎట్ ది స్పీడ్ ఆఫ్ గ్రోత్' అనే అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే వారికి సమయం ఆదా చేయడమే అతిపెద్ద లాభం. ఇదే రాష్ట్రానికి ఆర్థిక పోటీలో ఆధిక్యతను ఇస్తోంది. దీనికోసం రాష్ట్ర పెట్టుబడి ప్రోత్సాహక మండలి ప్రతినెలా సమావేశమై ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించడంతో పాటు, అంతర్గత సమస్యలను పరిష్కరిస్తోంది. భూమి, యుటిలిటీస్, పర్యావరణ అనుమతుల వంటి అంశాల్లో వరుస అనుమతులకు బదులుగా ప్యారలల్ ప్రాసెసింగ్‌ను ప్రవేశపెట్టడం ద్వారా ప్రాజెక్టులు ప్రారంభించే సమయాన్ని గణనీయంగా తగ్గించాం" అని వివరించారు. 2035 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను 'డే-జీరో రెడీ స్టేట్'గా గుర్తింపు పొందేలా చేయడమే తమ లక్ష్యమని లోకేశ్ పునరుద్ఘాటించారు. అంటే, పెట్టుబడి నిర్ణయం తీసుకున్న కొన్ని వారాల్లోనే క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభమయ్యేలా వ్యవస్థను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో నిర్ణయాలు వ్యక్తుల ఇష్టానుసారం కాకుండా, పటిష్టమైన వ్యవస్థ ఆధారంగా జరుగుతాయని హామీ ఇచ్చారు. రియల్ టైం డేటాతో పనిచేసే యూనిఫైడ్ డిజిటల్ గవర్నెన్స్ ద్వారా జాప్యాన్ని ముందుగానే గుర్తించి, అవరోధాలను తొలగిస్తున్నామని వివరించారు. పరిపాలనలో వేగాన్ని పెంచేందుకు డీ-రెగ్యులేషన్ డ్రైవ్‌లో భాగంగా గత 18 నెలల్లో 50కి పైగా సంస్కరణలు చేపట్టామని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా నాలా చట్టాన్ని రద్దు చేశామని, డీ-క్రిమినలైజేషన్ దిశగా మరిన్ని చర్యలు తీసుకోనున్నామని వెల్లడించారు. తాము రిస్క్ బేస్డ్ రెగ్యులేటరీ ఫ్రేమ్‌వర్క్‌ను అనుసరిస్తున్నామని, తక్కువ రిస్క్ ఉన్న ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు ఇస్తూ, అధిక ప్రభావం చూపే ప్రాజెక్టుల విషయంలో లోతైన పరిశీలన చేస్తున్నామని చెప్పారు. ఇది సుస్థిర అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని కొన్ని నగరాలకే పరిమితం చేయకుండా, అన్ని ప్రాంతాలకు విస్తరింపజేస్తున్నామని లోకేశ్ తెలిపారు. ఇందులో భాగంగా 175 నియోజకవర్గాల్లోనూ ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. ప్రతి జిల్లాలో ఎంఎస్ఎంఈ ఆధారిత వృద్ధి ద్వారా ఉద్యోగాలు, ఆదాయం, సంపద సమానంగా పంపిణీ అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి పార్కును స్థానిక వనరుల ఆధారంగా, అగ్రో-ప్రాసెసింగ్, సముద్ర ఉత్పత్తులు, టెక్స్‌టైల్స్, ఎలక్ట్రానిక్స్ వంటి రంగాల కోసం ప్రత్యేక క్లస్టర్లుగా అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. ఇది వలసలను తగ్గించడంతో పాటు, పెద్ద పరిశ్రమలకు సరఫరా వ్యవస్థను బలోపేతం చేస్తుందన్నారు. పరిశ్రమలకు వేగవంతమైన అనుమతులు, నాణ్యమైన మౌలిక వసతులు, నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించడమే ఏపీ ప్రత్యేకత అని లోకేశ్ అన్నారు. విధానాల స్థిరత్వం, సంస్థల విశ్వసనీయతతో పెట్టుబడిదారులకు భరోసా కల్పిస్తున్నామన్నారు. నమ్మకం, వేగం రెండూ కలిసి ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ పోటీ వాతావరణంలో ఒక ప్రత్యేక పెట్టుబడి గమ్యస్థానంగా నిలబెడుతున్నాయని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కెర్నీ సీనియర్ పార్ట్‌నర్ సుకేతు గాంధీ, గూగుల్ ఏసియా-పసిఫిక్ ప్రెసిడెంట్ సంజయ్ గుప్తా, కాగ్నిజెంట్ గ్లోబల్ సీఎఫ్ఓ జతిన్ దలాల్, రెన్యూ ఛైర్మన్ సుమంత్ సిన్హా తదితరులు పాల్గొన్నారు.

## ఈడీ ముందు తన పేరు ప్రస్తావించారేమోనని జగన్ కలవరపడుతున్నారన్న కేశవ్



**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 22,** జగన్ పై ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ విమర్శలు గుప్పించారు. లిక్కర్ స్కామ్ కేసులో ఈడీ విచారణలో మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ఈడీ విచారణలో ఏం చెప్పారోనన్న భయంతో జగన్ కలవరపడుతున్నారని అన్నారు. ఈ కేసులో ఈడీ ముందు విజయసాయి తన పేరును ఎక్కడ ప్రస్తావించారో అన్న ఆందోళనతోనే జగన్ ప్రజల దృష్టిని మళ్లించేందుకు అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ప్రశాంతత కోల్పోయిన జగన్ తన వ్యక్తిగత భయాన్ని ప్రజల బాధగా చిత్రీకరిస్తూ గందరగోళం సృష్టిస్తున్నారని విమర్శించారు. క్రెడిబిలిటీ లేని వ్యక్తి క్రెడిట్ చోరీ అంటూ మాట్లాడటం హాస్యాస్పదం అని ఎద్దేవా చేశారు. తన బురదను ఎదుటివారిపై చల్లే ప్రయత్నాలు జగన్ ఇంకా మానలేదన్నారు. పాసు పుస్తకాలపై రూ. 700 కోట్ల ప్రజాధనం ఖర్చు చేసి తన ఫొటోలు వేసుకునే హక్కు జగన్ కు ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. ప్రజల ఆస్తులపై తన బొమ్మలు ముద్రించుకోవడం దురహంకారమని మండిపడ్డారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ద్వారా రాష్ట్రంలో దోపిడీకి తెరలేపింది జగన్ ప్రభుత్వమేనని ఆరోపించారు. రీసర్వే, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ మధ్య తేడా కూడా తెలియకుండా జగన్ మాట్లాడుతున్నారని అన్నారు. సొంత బాబాయిని హత్య చేసిన వారిని పార్టీలో చేర్చుకున్న వ్యక్తి జగన్ కాదా అని ప్రశ్నించారు. రాజకీయ లబ్ధి తప్ప ప్రజా సంక్షేమం జగన్ కు పట్టదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎక్కడ చిన్న ఘటన జరిగినా దానికి రాజకీయ రంగు పులిముతూ కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని మంత్రి పయ్యావుల కేశవ్ తీవ్రంగా ధ్వజమెత్తారు.

## కోటప్పకొండ కొత్తపాలెం రోడ్డును ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 22,** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి పవన్ కల్యాణ్ కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి భక్తులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. శివరాత్రి ఉత్సవాలలోపు రహదారి సౌకర్యం కల్పిస్తామన్న హామీని నెరవేరుస్త. కోటప్పకొండ – కొత్తపాలెం గ్రామాల మధ్య నిర్మించిన నూతన రహదారిని గురువారం ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. రూ. 3.9 కోట్ల పంచాయతీరాజ్ నిధులతో 8 కిలోమీటర్ల మేర ఈ రోడ్డును నిర్మించారు. కోటప్పకొండ క్షేత్ర దర్శనం అనంతరం కొండ దిగువన ఉన్న శివస్థూపం వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని పవన్ కల్యాణ్ ఆవిష్కరించారు. ఆ తర్వాత రోడ్డుపై కొంత దూరం నడిచి, నిర్మాణ నాణ్యతను స్వయంగా పరిశీలించారు. గత అసెంబ్లీ సమావేశాల సందర్భంగా, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ అరవింద్ బాబు ఈ రోడ్డు ఆవశ్యకతను పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. భక్తుల ఇబ్బందులను తొలగించేందుకు ఈ రహదారి నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన పవన్, శివరాత్రి నాటికి రోడ్డును పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ నూతన రహదారితో మహాశివరాత్రి ఉత్సవాలకు తరలివచ్చే సుమారు లక్షన్నర మంది భక్తుల ప్రయాణ కష్టాలు తీరనున్నాయి. అంతేకాకుండా, కొత్తపాలెం గ్రామ పరిసరాల్లోని రైతులకు వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు, గోనేపూడి పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు కూడా ఈ రోడ్డు ఎంతగానో ఉపయోగపడనుంది. రోడ్డు ప్రారంభోత్సవం సందర్భంగా గోనేపూడి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు పవన్ కల్యాణ్‌ను కలిసి, తమ కోసం రహదారి నిర్మించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తమ పాఠశాలకు క్రీడా మైదానంతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరుతూ ఆయనకు వినతిపత్రం సమర్పించారు. ఈ పర్యటనలో భాగంగా పవన్ కల్యాణ్కోటప్పకొండలో చేపట్టనున్న గిరిప్రదక్షిణ మార్గం నమూనా లేఅవుట్‌తో పాటు, జింకల పార్కును కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు, జనసేన నరసరావుపేట ఇన్‌ఛార్జ్ సయ్యద్ జిలానీ, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, ఇతర అధికారులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## కోల్ సొసైటీ అక్రమాలపై కొరడా ఎట్టకేలకు సెక్షన్ 52 విచారణ

**కమిషనర్ ఆదేశించిన మూడు వారాలకు డీసీవో నిర్ణయం**

**విచారణాధికారిగా అసిస్టెంట్ రిజిస్ట్రార్ సురేంద్ర నియామకం**

**ఇప్పటికే సహకారశాఖ అధికారుల నోటీసులపై ఇద్దరు డైరెక్టర్లు రివర్స్**

**మరోవైపు హైకోర్టులోనూ వ్యవహారం**




**క్రైం కౌంటర్ న్యూస్,**ఒంగోలు, జనవరి 22 : కోల్ సొసైటీలో అక్రమాలపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాల్సిన సహకారశాఖ జిల్లా అధికారులు ఏళ్ల తరబడి ఉదాసీనంగా వ్యవహరించారు. నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న పాలనా వ్యవహారాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో కోల్ సొసైటీ వ్యవహారా లపై గత నెలలో సంస్థ సభ్యులైన మద్దిరాలపాడుకు చెందిన షేక్ ఖాజావలి, తాళ్లూరి కృష్ణారావు హైకోర్టులో పిటిషన్ వేసిన తర్వాత కాని అధికారుల్లో చలనం రాలేదు. ఆ పిటిషన్ కన్నా ముందుగానే సహకారశాఖలోని రాష్ట్ర, జిల్లా అధికారులకు వారిద్దరూ కోల్‌సొసైటీ నిర్వహణకు సంబంధించిన పలు అంశాలపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించలేదు. దీంతో హైకోర్టును ఆశ్రయించిన వారు సదరు అధికారులను కూడా ప్రతివాదులుగా చేర్చారు. కోర్టు నుంచి వచ్చిన తాఖీదులతో రాష్ట్ర, జిల్లా అధికారుల్లో కదలిక వచ్చింది. కోల్ సొసైటీపై తక్షణం సెక్షన్ 52 విచారణ నిర్వహించి నివేదించాలని సహకారశాఖ కమిషనర్ అహ్మద్‌బాబు గత నెల 31న డీసీవోను ఆదే శిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. మరోవైపు తనకు ఆడిటర్లు ఇచ్చిన నివేదికలో కోల్‌సొసైటీ నిర్వహణలో పలు అవకతవకలు ఉన్నట్లు తేల్చారని, ఈ దృష్ట్యా విచారణ చేయించాలని ఒంగోలు డీసీఎల్‌వో కూడా అంతకు రెండు రోజుల ముందు డీసీవోకు లేఖ రాశారు. తక్షణ విచారణకు ఆదేశించాల్సిన డీసీవో శ్రీలక్ష్మి దాదాపు మూడు వారాలపాటు పట్టించుకోకపోవడం ఉదాసీన వైఖరిని స్పష్టం చేస్తోంది. ప్రధాన ఆరోపణలు ఇవీ..

కోల్‌సొసైటీపై కమిషనర్‌కు ఇరువురు సభ్యులు చేసిన ఫిర్యాదులు, ఆడిటర్లు డీఎల్‌సీవోకు నివేదించిన అంశాలపై మాత్రమే సెక్షన్ 52 విచారణ సాగుతుంది. ప్రధాన ఆరోపణల్లో సహకార చట్ట నిబం ధనలకు విరుద్ధంగా 2018 డిసెంబరులో ఒకసారి, 2023 డిసెంబరులో మరోసారి అక్రమంగా, అనైతికంగా సొసైటీ పాలక మండలి ఎన్నికలు నిర్వహించడం ఉంది. జనరల్ బాడీ ఆమోదం లేకుండా బ్యాం కులో ఉన్న రూ. 2.15 కోట్ల మేర సొసైటీ ఫిక్స్‌డ్ డిపాజిట్లు విత్‌డ్రాతోపాటు మరో రూ. 11 కోట్ల బ్యాంకు రుణం తెచ్చి అనధి కార నిర్మాణాలు చేసి లీజుకు ఇవ్వడం కూడా ఉన్నాయి. ఆ వ్యవహారాలు జరిగిన ప్పుడు ఒంగోలు డివిజనల్ సహకారశాఖ అధికారిగా, డీసీవోగా, డీసీఏవోగా మూడు కీలక బాధ్యతలు నిర్వర్తించి ప్రస్తుతం కావలి డీఎల్‌సీవోగా పనిచేస్తున్న పోలిశెట్టి రాజశేఖర్ అనే అధికారి ఎలాంటి చర్యలు తీసుకోనందున అతనిపై చర్యలు తీసుకోవా లని ఫిర్యాదులు ఉన్నాయి. అలాగే డీఎల్‌సీ వోకు ఆడిటర్లు ఇచ్చిన నివేదికలో.. ఎస్‌బీఐ నుంచి రూ. 5.60 కోట్ల రుణాలు తీసుకోవ డం, ఎరువుల కంపెనీకి రూ. 4.53లక్షలు పెనాల్టీ చెల్లింపు, రూ. 90వేల బోనస్ సిబ్బం దికి ఇవ్వడం, రూ 8.50 లక్షల కమీషన్‌ను కార్పొరేట్ ప్రాపర్టీస్‌కు చెల్లించడం వంటి పలు వ్యవహారాలను నిబంధనలకు విరు ద్ధంగా జరిగినట్లు పేర్కొన్నారు. వీటన్నిం టిపైనా సహకార చట్టం సెక్షన్ 52 కింద విచారణ చేయాల్సి ఉంది. ఇదిలా ఉండగా వ్యవహారం హైకోర్టుకు చేరిన నేపథ్యంలో ఎవరికి వారు తమకు ఇబ్బంది రాకుండా చూసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఆ క్రమంలోనే గత నెలలో ఒంగోలు డీసీఎల్‌వో కోల్ సొసైటీ డైరెక్టర్లకు నోటీసులు ఇవ్వగా ఇద్దరు డైరెక్టర్లు ఘాటుగా రివర్స్ సమాధానం ఇచ్చిన విషయం విదితమే. ఈనేపథ్యంలో కోల్ సొసైటీపై విచారణ ఎలా సాగుతుందన్నది వేచిచూడాల్సి ఉంది.

## పోలీసు శాఖ విభజనపై కసరత్తు పూర్తి దర్శిలోని డీఎస్పీ కార్యాలయం

**సబ్ డివిజన్‌గా దర్శి లేక అద్దంకి**

**గిద్దలూరు కేంద్రంగా కొత్తది ఏర్పాటు**

**దర్శి, మార్కాపురం పట్టణ పోలీస్ స్టేషన్లు అప్‌గ్రేడ్**

**కందుకూరు సబ్‌డివిజన్‌లోకి కొండపి సర్కిల్**

**సిద్ధమైన ప్రతిపాదనలు**




**క్రైం కౌంటర్ న్యూస్,** ఒంగోలు క్రైం, జనవరి 22 : జిల్లా పునర్విభజన నేపథ్యంలో పోలీసు శాఖను కూడా విభజించాల్సిన పరిస్థితి నెలకొంది. పరిపాలన సౌలభ్యం, ప్రజాప్రతినిధుల సూచనలను పరిగణనలోకి తీసుకున్న అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఉమ్మడి జిల్లాలో 8 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా అందులో ప్రస్తుతం నాలుగు మార్కాపురం జిల్లాలోకి వెళ్లాయి. కందుకూరు, అద్దంకి నియోజకవర్గాలను కలపడంతో ప్రకాశం జిల్లాలో ప్రస్తుతం ఆరు నియోజకవర్గాలు ఉన్నాయి. ప్రకాశంలో రెండు అసెంబ్లీ నియోజకవర్గాలు కలిపి ఒక పోలీసు సబ్‌డివిజన్‌గా ఏర్పాటు చేయనున్నారు. ఆ ప్రకారం ఒంగోలు, సంతనూతలపాడు ఒంగోలు సబ్‌డివిజన్‌గానే ఉంటుంది. దర్శి, అద్దంకి నియోజకవర్గాలు దర్శి సబ్‌డివిజన్‌గా, కందుకూరు సబ్‌డివిజన్‌లో కొండపి, కందుకూరు నియోజకవర్గాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. మార్కాపురం జిల్లాలో ప్రస్తుతం మార్కాపురం, కనిగిరి పోలీసు సబ్‌డివిజన్‌లు ఉన్నాయి. కొత్తగా గిద్దలూరును సబ్ డివిజన్ చేయాలని పోలీసు యంత్రాంగం భావిస్తోంది.

**ఒంగోలు సబ్ డివిజన్ యథాతథం**

ఒంగోలు సబ్ డివిజన్‌లో ఎలాంటి మార్పులు చేసే అవకాశం లేదు. అయితే పోలీసు స్టేషన్‌ల పరిధిలో ఉన్న కొన్ని గ్రామాలను నియోజకవర్గాలకు అనుగుణంగా మార్పులు చేయనున్నారు. ఉదాహరణకు ఇప్పటి వరకూ ఒంగోలు తాలూకాలో ఉన్న మద్దిరాలపాడును నాగులుప్పలపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోకి తీసుకురావాలని ప్రతిపాదిస్తున్నారు. దర్శి పట్టణ పోలీస్ స్టేషన్‌ను అప్‌గ్రేడ్ చేసి ఎస్‌హెచ్‌వోగా సీఐను నియమించనున్నారు. దర్శి రూరల్ సర్కిల్ కింద ప్రస్తుతం ఆ నియోజకవర్గంలోని అన్ని మండలాలను చేర్చనున్నారు. ఆప్రకారం గతంలో త్రిపురాంతకం సర్కిల్ పరిధిలో ఉన్న కురిచేడు, దొనకొండ పోలీసు స్టేషన్‌లు దర్శి రూరల్ పరిధిలోకి రానున్నాయి.

**కందుకూరు సబ్‌డివిజన్‌లోకి కొండపి**

కందుకూరు సబ్‌డివిజన్‌లోకి ప్రస్తుతం ఉన్న కొండపి సర్కిల్‌ను చేర్చారు. టంగుటూరు, సింగరాయకొండ పోలీసు స్టేషన్‌లను ఒంగోలు సబ్ డివిజన్‌లోనే ఉంచే అవకాశం ఉంది. అలా అయితేనే ఎలాంటి సమస్యలు ఉండవని పోలీసు అధికారులు భావిస్తున్నారు. అయినప్పటికీ ఒంగోలు సబ్‌డివిజన్ నుంచి టంగుటూరు, సింగరాయకొండలను తొలగించి కందుకూరులో కలిపే ప్రతిపాదన కూడా తయారు చేసినట్లు తెలిసింది. ఈ విషయంలోనూ ప్రజాప్రతినిధుల అభిప్రాయం కీలకం కానుంది.

**దర్శి సబ్ డివిజన్‌పై చర్చ**

ప్రస్తుతం ఉన్న దర్శి సబ్ డివిజన్‌ను యథాతథంగా కొనసాగిస్తారా? లేక అద్దంకికి మార్చుతారా? అన్న చర్చ సాగుతోంది. దర్శి సబ్ డివిజన్‌కు అద్దంకిగా పేరు మార్చి దర్శిలో ఉంచాలన్న ప్రతిపాదన కూడా పరిశీలనలో ఉంది. దీనిపై ప్రజాప్రతినిధుల అభిప్రాయం మేరకు నిర్ణయం తీసుకోనున్నారు.

**మార్కాపురం పోలీసు స్టేషన్ అప్‌గ్రేడ్**

మార్కాపురం పట్టణ పోలీస్ స్టేషన్‌ను అప్‌గ్రేడ్ చేసి అక్కడ ఎస్‌హెచ్‌వోగా ఇన్‌స్పెక్టర్‌ను నియమించి మార్కాపురం రూరల్ పోలీస్ స్టేషన్‌ను సర్కిల్ చేయాలన్న ప్రతిపాదన కూడా ఉంది. అదేవిధంగా త్రిపురాంతకం సర్కిల్‌లో పెద్దారవీడును చేర్చి దాన్ని కొనసాగించాలని భావిస్తున్నారు. ఇలా పలు మార్పులు, చేర్పులతో పోలీసు అధికారులు ప్రతిపాదనలు చేశారు. వీటికి ఉన్నత స్థాయి కమిటీ ఆమోదం లభిస్తే విభజన ప్రక్రియ పూర్తవుతుంది.

## క్రెడిట్ కార్డ్ బాదుడుకు బ్రేక్ పడేనా?

### వడ్డీ రేట్లపై పరిమితి విధించాలని పురందీశ్వరి డిమాండ్!



**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 22,** దేశంలో క్రెడిట్ కార్డ్ వినియోగదారులపై బ్యాంకులు విధిస్తున్న భారీ వడ్డీ రేట్లు, పెనాల్టీ ఛార్జీలపై బిజెపి ఎంపీ దగ్గుబాటి పురందీశ్వరి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్‌ను కలిసి ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలు క్రెడిట్ కార్డ్ బకాయిల చక్రబంధంలో చిక్కుకోకుండా ఉండేందుకు తక్షణమే ఆర్‌బీఐ (=దీ×) మార్గదర్శకాలకు అనుగుణంగా కఠినమైన నిర్ణయాలు తీసుకోవాలని ఆమె కోరారు. ముఖ్యంగా నిబంధనల పేరుతో బ్యాంకులు వసూలు చేస్తున్న అదనపు ఛార్జీలు ప్రజల ఆర్థిక స్థితిగతులను దెబ్బతీస్తున్నాయని ఆమె పేర్కొన్నారు.

భారతదేశంలో ప్రస్తుతం క్రెడిట్ కార్డ్ వడ్డీ రేట్లు విపరీతంగా ఉన్నాయని, ఇవి వార్షికంగా 24 శాతం నుండి 48 శాతం వరకు వసూలు చేయబడుతున్నాయని పురందీశ్వరి ఈ సందర్భంగా ఎత్తి చూపారు. కొన్ని బ్యాంకులు మరియు ఆర్థిక సంస్థలైతే ఏకంగా 55 శాతానికి పైగా వడ్డీని, అదనంగా భారీ పెనాల్టీలను విధిస్తున్నాయని ఆమె మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇంతటి భారీ స్థాయిలో వడ్డీ వసూలు చేయడం వల్ల వినియోగదారులు అప్పుల ఊబి నుంచి బయటపడలేకపోతున్నారని, ఇది ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆమె విశ్లేషించారు.

అంతర్జాతీయ మార్కెట్లతో పోల్చినప్పుడు భారత్‌లో వడ్డీ రేట్లు అత్యంత ఎక్కువగా ఉన్నాయని పురందీశ్వరి వివరించారు. ఉదాహరణకు అమెరికా (ఖూ) వంటి దేశాల్లో క్రెడిట్ కార్డ్ వడ్డీ రేట్లను గరిష్ఠంగా 10 శాతానికి పరిమితం చేశారని, అక్కడ వినియోగదారుల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తారని ఆమె గుర్తుచేశారు. అదే తరహాలో మన దేశంలో కూడా వడ్డీ రేట్లపై ఒక గరిష్ఠ పరిమితిని నిర్ణయించాల్సిన అవసరం ఉందని ఆమె గట్టిగా వినిపించారు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఇలాంటి నియంత్రణ లేకపోతే సామాన్యుల ఆర్థిక భద్రత ప్రశ్నార్థకంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

క్రెడిట్ కార్డ్ జారీ చేసే సమయంలో బ్యాంకులు పారదర్శకంగా వ్యవహరించాలని, దాగి ఉన్న నిబంధనలతో కస్టమర్లను ఇబ్బంది పెట్టకూడదని ఆమె విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో జోక్యం చేసుకుని, వడ్డీ రేట్లు మరియు పెనాల్టీలపై ఒక హేతుబద్ధమైన విధానాన్ని తీసుకురావాలని కోరారు. ఎంపీ పురందీశ్వరి వినతిపై స్పందించిన ఆర్థిక మంత్రి, ఈ అంశాన్ని సానుకూలంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రతిపాదన గనుక అమలైతే దేశంలోని కోట్లాది మంది క్రెడిట్ కార్డ్ వినియోగదారులకు పెద్ద ఉపశమనం లభించే అవకాశం ఉంది.

## జగన్ పాదయాత్ర ప్రకటనపై నిమ్మల విమర్శలు




**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 22,** రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేపట్టబోతున్నట్టు వైసీపీ అధినేత జగన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మంత్రి నిమ్మల రామానాయుడు స్పందిస్తూ విమర్శలు గుప్పించారు. ఏపీలో వైసీపీ శకం పూర్తిగా ముగిసిందని అన్నారు. అధికారం కోల్పోయిన తర్వాతే జగన్?కు పాదయాత్ర గుర్తొచ్చిందంటూ ఎద్దేవా చేశారు. ఐదేళ్ల పాటు మొద్దు నిద్రలో ఉన్న జగన్ ఇప్పుడు పాదయాత్ర పేరుతో మరోసారి డ్రామాకు తెరతీశారని విమర్శించారు. పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం ఏనుగువానిలంక గ్రామంలో నిమ్మల పర్యటించారు. ఈ సందర్భంగా రూ. 10.92 కోట్ల వ్యయంతో కాజ మేజర్ డ్రైన్?పై అవుట్?ఫాల్స్ స్లూయిస్ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే యలమంచిలి నుంచి బాడవ వరకు గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. గత ఐదేళ్లలో గోదావరి వరదల కారణంగా వేలాది ఎకరాల పంటలు నష్టపోయాయని ఆయన గుర్తు చేశారు. అప్పట్లో అధికారులు వచ్చి వెళ్లారే తప్ప, కాజ మేజర్ డ్రైన్ అవుట్?ఫాల్స్ స్లూయిస్ పనులకు మాత్రం మోక్షం కలగలేదన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాకే ఈ పనులకు శంకుస్థాపన జరిగిందని స్పష్టం చేశారు. రైతుల కష్టాలు తెలుసుకుని పనిచేసే ప్రభుత్వం తమదేనని నిమ్మల రామానాయుడు తెలిపారు. సాగునీటి సమస్యలు, ముంపు బాధలను శాశ్వతంగా పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. జగన్ పాదయాత్రలకే పరిమితమైతే, తాము పనులతో ప్రజలకు జవాబు ఇస్తామని నిమ్మల స్పష్టం చేశారు.

# ఏటా తగ్గుతున్న 'పట్టు' సాగువిస్తీర్ణం



క్రైం కౌంటర్ న్యూస్, కురబలకోట, జనవరి 21 పట్టు రైతుల్లో నైరాశ్యం అలముకుంది. ఫలితంగా సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. పట్టుసాగుకు నిలయమైన పడమటి ప్రాంత మండలాల్లో ఇప్పుడు అంతంత మాత్రంగానే సాగవుతోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కనీస ప్రోత్సాహం లభించక, రైతులు గత్యంతరం లేక ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లిపోవాల్సి వచ్చింది. నికర లాభాలను ఆర్జించవచ్చుననే గట్టి నమ్మకంతో ఇక్కడి అన్నదాతలు ఈ పంటను సాగు చేసేవారు. కరోనా సమయంలో రైతులు తీవ్ర నష్టాలను చవిచూడాల్సి వచ్చింది. స్పందించి ఆదుకోవాల్సిన నాటి వైసీపీ ప్రభుత్వం ఏమాత్రమూ పట్టించుకోలేదు. దీంతో నష్టాల నుంచి కోలుకోవడానికి చాలా ఏళ్లు పట్టింది. కరోనా వరకూ పట్టు సాగు బాగానే సాగినా అనంతర పరిణామాలు రైతులకు పెనుశాపమయ్యాయి. కరోనా సమయంలో ధరలు తగ్గుముఖం పట్టడంతో రైతులు నష్టపోయారు. ధరలు, తగిన మార్కెటింగ్ వసతి లేకపోవడంతో నిరాశ చెందుతున్నారు. కర్ణాటకలోని చింతామణి, కోలార్, సిల్లగట్టు తదితర ప్రాంతాలకు తరలించి ఉత్పత్తిని అమ్ముకోవడం ఇబ్బందికరంగా తయారైంది. అప్పట్లో అక్కడి మార్కెట్‌లో మొదటి రకం రూ.400 నుంచి రూ.500 వరకు, రెండో రకం రూ.250 నుంచి రూ.450 మాత్రమే విక్రయించేవారు. తర్వాత అక్కడ ధరల తగ్గుదల రైతులను కుంగదీసింది. ఇప్పుడు పెరిగినా రైతులు గతానుభవంతో ఆసక్తి చూపడంలేదు.కనీస ప్రోత్సాహమూ కరువే..గత వైసీపీ ప్రభుత్వం పట్టు రైతుల కోసం రాయితీలుగాని, ప్రోత్సాహకాలు ప్రకటించలేదు. సాధారణంగా షెడ్డు నిర్మాణానికి రూ.4లక్షలు రాయితీతో సమకూర్చాల్సి ఉంది. ఇందులో కేంద్ర ప్రభుత్వం 50శాతం, రాష్ట్ర ప్రభుత్వం 25శాతం రాయితీ ఇవ్వాలి. మిగిలింది లబ్ధిదారుడు భరించాలి. గత ప్రభుత్వం ఏ ఒక్క రైతుకు ఆ నిధులు అందజేయలేదు. 2019కి ముందు బైవోల్టిన్ రకం పట్టు సాగుకు కిలోకు రూ.50 ప్రోత్సాహకాన్ని అందించేవారు. ఆ రాయితీని కూడా పూర్తిగా ఆపేశారు. గతంలో రైతుల సమస్యలు తీర్చడానికి ప్రతి మండలానికీ ఇన్‌స్పెక్టర్, టీఏలు ఉండేవారు. వారిలో ఎక్కువమంది రిటైరయ్యారు. ఇప్పుడు 15మండలాలకు ఒక అధికారితో కాలం వెళ్లదీస్తున్నారు. కూటమి వచ్చాక బకాయిల విడుదల పట్టు ధరలు గతంతో పోల్చితే ఇప్పుడు రెట్టింపు పెరిగినా సాగు విస్తీర్ణం మాత్రం భారీస్థాయిలో తగ్గిపోయింది. 15 ఏళ్ల క్రితం వరకు కురబలకోట మండల పరిధిలో వెయ్యి ఎకరాలకు పైగా సాగు చేసేవారు. ప్రస్తుతం 50 ఎకరాల్లో మాత్రమే సాగు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పట్టు ధరలు భారీగా పెరిగినా గత ప్రభావంతో రైతులు సాగు చేయడానికి ముందుకు రావడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక పట్టు రైతులకు రాయితీలు, ప్రోత్సాహకాలను అందించేందుకు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలోనే పెండింగ్ బకాయిలను విడుదల చేసింది.

# గ్రామాలను పరిశీలించండి

క్రైం కౌంటర్ న్యూస్, రాజమహేంద్రవరం, జనవరి 22 శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని, రౌడీ షీటర్ల కదలికలు అసాంఘిక వ్యక్తుల కార్య కలాపాలపై నిరంతర నిఘా ఉంచాలని ఎస్పీ నరసింహ కిశోర్? ఆదేశించారు. జిల్లా పోలీస్? కార్యాలయంలో గురువారం జిల్లాలోని సర్కిళ్ల వారీగా నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహిం చారు. మహిళల భద్రతకు, రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన పటిష్ట చర్యలు తీసు కోవాలన్నారు. బ్లాక్? స్పాట్? ప్రదేశాల్లో డ్రోన్?ల ద్వారా తరచుగా పర్యవేక్షణ చేయాలని ఆదేశిం చారు. ప్రతి కేసులో సాంకేతిక ఆధారాలను సేకరించి, అందుబాటులో ఉన్న సాంకేతికతను వినియోగించి దర్యాప్తు చేస్తే నేరస్తులకు శిక్షలు పడే శాతం పెరుగుతుందన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, తాగి వాహనాలు నడపడం వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారిం చాలన్నారు. తీవ్రమైన కేసుల్లో నిర్ణీత గడువు లోగా దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్లు వేయాలన్నారు. సొంతగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొనే విధంగా ప్రజలకు అవగా హన కల్పించాలని చెప్పారు. అనుమానిత, సమస్యాత్మక ప్రాంతాల్లో తరచుగా కార్డన్? సెర్చ్? ఆపరేషన్స్? నిర్వహించాలన్నారు. పోలీసు అధికారులు తప్పనిసరిగా గ్రామాలను సంద ర్శించి పరిస్థితులను అంచనా వేస్తూ ఉండా లన్నారు. దాంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎదురయ్యే సమస్యలను అరికట్టడం సులభ తరం అవుతుందన్నారు.రాత్రి వేళల్లో గస్తీ ముమ్మరం చేయాలని, అనుమానితుల వేలి ముద్రలను ఎంఎస్?డీ డివై జ్? ద్వారా తనిఖీ చేయాలని ఎస్పీ ఆదేశించారు.కోనసీమ జిల్లా నుంచి మండపేట, రాయ వరం, కపిలేశ్వరపురం మండలాలను తూర్పు గోదావరి జిల్లాకు ప్రభుత్వం బదలాయించిన విషయం విధితమే. ఈ ప్రక్రియలో భాగంగా ఆయా మండలాల్లో పోలీస్? స్టేషన్లను జిల్లాలో కలుపుతూ ప్రభుత్వం జీవో నెం.9 జారీ చేసింది.ఈ మేరకు ఇప్పటి వరకూ రామ చంద్రాపురం సబ్? డివిజన్?లో ఉన్న మండ పేట అర్బన్? సర్కిల్?, రూరల్?, రూరల్? సర్కిల్? పరిధిలోని అంగర, రాయవరం పోలీస్? స్టేష న్లు ఇకపై తూర్పుగోదావరి జిల్లాలోని ఈస్ట్? జోన్?లో కొనసాగుతాయి.జిల్లాలో నాలుగు పోలీస్? జోన్లు,ఒక సబ్? డివిజన్? ఉంది. వన్? టౌన్?,టూటౌన్?, ప్రకాశంనగర్? సెంట్రల్? జోన్?, టూటౌన్?, ధవళేశ్వరం,కడియం, బొమ్మూరు సౌత్?జోన్?, రాజానగరం, కోరు కొండ, సీతాన గరం,ఎయిర్?పోర్ట్?, గోకవరం నార్త్? జోన్?లో ఉన్నాయి.కొవ్వూరు సబ్? డివిజన్?లో కొవ్వూరు టౌన్?,రూరల్?, తాళ్లపూడి, చాగల్లు, నిడదవోలు, సమిశ్రగూడెం,పెరవలి, ఉండ్రాజవరం, దేవర పల్లి, గోపాలపురం, నల్లజర్ల ఉన్నాయి. కొత్త వాటి కలయికతో ఈస్ట్? జోన్? పరిధిలో ఉన్న బొమ్మూరు పోలీస్? స్టేషన్?ని సౌత్? జోన్? పరిధి లోకి తెస్తారని చెబుతున్నారు.అప్పుడు ఈస్ట్? జోన్? పరిధిలో అనపర్తి సర్కిల్?లోని అన పర్తి, బిక్కవోలు,రంగంపేట, కొత్తగా కలిసిన స్టేషన్లు ఉంటాయి.ఈస్ట్? జోన్? డీఎస్పీ కార్యాల యాన్ని ద్వారపూడి తరలించే ఆలోచన చేస్తున్నారు.



# పెట్టుబడుల..దా..ఊస్! సీఎం చంద్రబాబు, లోకేశ్ ప్రజంటేషన్లు

**కాకినాడలో భారీ పరిశ్రమలకు స్వాగతం**
**కోనసీమలో హోంస్టే..తమారా కంపెనీకి వినతి**
**గోదారి అందాలు చాటేలా ఎకో టూరిజం**
**యు.కొత్తపల్లిలో ఏంఎంజీ మెటల్ ప్లాంట్**
**విశాఖ ఎకనమిక్ రీజియన్‌లో ఉమ్మడి జిల్లా**



క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 22, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాను పారిశ్రామి కం గా, పర్యాటకపరంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం శర వేగంగా అడుగులు వేస్తోంది. వేల కోట్ల పెట్టుబ డులు, పరిశ్రమలు ఈ ప్రాంతానికి వచ్చేలా కృషి చేస్తోంది. అది విశాఖ పెట్టుబడుల సదస్సు అయినా.. దావోస్‌లో పెట్టుబడుల వేట అయినా కాకినాడ, కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాల్లో అనుకూలతలను వివరించి పరిశ్రమలు, ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రతిపా దనలను ఆయా కంపెనీల ముందుంచుతోంది. తాజా గా దావోస్ పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి లోకేశ్ అనేక కంపెనీల ముందు ఉమ్మడి జిల్లాలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించి పలు ప్రతిపాదనలు ముందుంచారు.కాకినాడ సెజ్, పోర్టులో పెట్టుబడులతో పాటు కోనసీమలో హోం స్టేలు, గోదావరిలో ఎకో టూరిజం ప్రాజెక్టులు పరిశీ లించాలని కోరడంతో దావోస్‌లో కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల ఊసు చర్చకు వచ్చింది.

రండి.. రండి.. దయచేయండి

కాకినాడ సెజ్ 8 వేల ఎకరాల్లో విస్తరించి ఉంది. ఎన్నో ఏళ్ల కింద సేకరించిన ఈ భూముల్లో ఇప్ప టికీ సరైన భారీ పరిశ్రమల జాడే లేదు. దీంతో సెజ్‌ను పారిశ్రామికంగా అభివృద్ధి చేసేలా ప్రభు త్వం దృష్టిసారించింది. తద్వారా స్థానికులకు వేల ల్లో ఉపాధి లభించేలా శ్రద్ధ వహించింది.దావోస్ పర్యటనలో ఉన్న మంత్రి నారా లోకేశ్ డెన్మార్క్‌కు చెందిన పవన విద్యుత్ సంస్థ వెస్టాస్ గ్రూప్‌తో భేటీ అయ్యారు. కాకినాడ సెజ్‌లో పవన విద్యుదుత్పత్తికి వీలుగా విండ్ టర్బైన్ బ్లేడ్ పరిశ్రమల ఏర్పాటు చేయాలని కోరారు. నాసెల్లె ఆఫ్ షోర్ తయారీ యూనిట్ స్థాపించా లని ప్రతిపాదిం చారు.

కాకినాడలో ప్రస్తుతం ఏఎం గ్రీన్ సంస్థ రూ.13 వేల కోట్లతో గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ ఏర్పాటు చేస్తోంది. తద్వారా విదేశాలకు గ్రీన్ అమ్మోనియాను ఎగుమతి చేయబోతోంది. దీనికి ఇటీవల సీఎం చంద్రబాబు, పవన్ శంకుస్థాపన చేశారు.ఈ నేపథ్యంలో కాకినాడపోర్టు నుంచి ఎగుమతి సదుపాయాలు వినియోగించుకుని గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి కేంద్రంలో పెట్టుబడులు పెట్టాలని జపాన్‌కు చెందిన రెన్యువల్ ఎనర్జీ సంస్థ జెరా గ్లోబల్ సీఈవో యుకియో కానిని సీఎం చంద్రబాబు, లోకేశ్ కోరారు.

కాకినాడ పోర్టులో హైడ్రోజన్ టెర్మినల్ ట్రాక్టర్స్ పైలట్ వాహనాలను తయారు చేసి వినియోగించేలా కాంప్లెక్ట్ వెహికిల్స్ మొబిలిటి సిస్టం అభివృద్ధిలో ప్రత్యేకత కలిగిన ఏవో సంస్థ ముందు లోకేశ్ మరో ప్రతిపాదన ఉంచారు. ఇవన్నీ సాకారమైతే వేల కోట్ల పెట్టుబడులు కాకినాడకు క్యూ కట్టనున్నాయి.

ప్రకృతి అందాలకు నెలవైన కోనసీమలో హోంస్టే ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలని తమారా లీజర్ సీఈవో శిబులాల్ ముందు సీఎం చంద్రబాబు పెట్టుబడుల ప్రతిపా దనలు ఉంచారు.పోలవరం నుంచి భద్రాచలం వరకు గోదావరి అందాలకు పెట్టింది పేరని..తూర్పుగోదావరి జిల్లాలో ఎకో టూరిజం ప్రాజెక్టులు భారీగా ఏర్పాటు చేసే వీలుందని వివరించారు. తమ ప్రభుత్వం కంపెనీలకు అనుమతుల నుంచి స్థాపన వరకు అనుమతులిస్తామని వివరించారు.

విశాఖలోనూ పెట్టుబడులు రాబట్టారు..

గతేడాది నవంబరులో రాష్ట్ర ప్రభుత్వం విశాఖలో నిర్వహించిన పెట్టుబడుల సదస్సులోనూ ఉమ్మడి జిల్లాలో పెట్టుబడుల అవకాశా లను సీఎం వివరించారు. అక్కడికక్కడే పలు ప్రోత్సాహకాలు ప్రకటించి పెట్టుబడులు రాబట్టారు. కాకినాడలో నాఫ్తా కాంప్లెక్స్, పాలిమర్స్ కంపెనీ ఏర్పాటు చేయడానికి ముం దుకు రావాలని ఎల్‌జీ కెమికల్స్ కంపెనీతో సీఎం చర్చలు జరిపారు. యు.కొత్తపల్లి మండలం మూల పేటలో ఈ రెండింటినీ ఏర్పాటు చేసే విషయమై పరిశీలించాలని కోరారు. ఎల్‌జీ కంపెనీ నాఫ్తా కాంప్లెక్స్ ఏర్పాటుకు సానుకూలంగా స్పందిస్తే రూ.60 వేల కోట్ల వరకు పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని అంచనా. సముద్రంలో షిప్ క్రూయిజ్ నిర్వహణలో ప్రఖ్యాతి గాంచిన కోర్డెలియా క్రూయిజ్ కంపెనీ ప్రతినిధులతోను చర్చలు జరి పారు. కాకినాడ నుంచి విశాఖ అక్కడి నుంచి భీమిలికి షిప్ క్రూయిజ్ సర్వీసులు నడపడానికి కలిసిరావాలని కోరారు. పెట్టుబడుల సదస్సు కు ఒక రోజు ముందు కాకినాడకు మరో భారీ పెట్టుబడిని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. 800 ఎకరాల్లో రూ.44 వేల కోట్లతో ఏఎంజీ మెటల్‌అండ్ మెటీరియల్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ అల్యూమినియం స్మెల్టర్ ఏర్పాటుకు అనుమతులు జారీ చేసింది. పిఠాపురం నియోజక వర్గం యు.కొత్తపల్లి మండలంలో ఈ కంపెనీ ఏర్పాటుకానుంది. ఈ పరిశ్రమ ద్వారా పలు ప్లాంట్లకు ఉపయోగపడే బిల్లెట్స్, వైర్‌రాడ్‌లు, అల్యూమినియం షీట్లు, కాయిల్స్ వంటివి తయారు చేస్తారు.ఏఎం గ్రీన్ అమ్మోనియా ప్లాంట్, అల్యూమినియం స్మెల్టర్ ప్లాంట్ ఏర్పాటు, దావో స్ పెట్టుబడులు ఫలిస్తే ఉమ్మడి జిల్లా రూపు రేఖలు పారిశ్రామికంగా, పర్యాటకంగా మారిపోనున్నాయి.పారిశ్రామిక, పర్యాటకాభివృద్ధికి ఇప్పటి కే ఉమ్మడి జిల్లాను ప్రభుత్వం విశాఖ ఎకనమిక్ రీజియన్‌లో చేర్చింది.

# తాగునీరే కీలకం జడ్పీ సమావేశంలో సభ్యుల మాట

**వేసవిలో నీటి సమస్య పరిష్కారానికి నిధులివ్వాలని వినతి**
**మొవ్వ సాంఘిక సంక్షేమ వసతి గృహం అంశంపై ఆగ్రహం**
**సాంఘిక సంక్షేమ శాఖ డీడీ పనితీరు బాగోలేదని ధ్వజం**
**రూ.120.34 కోట్ల ప్రారంభ నిల్వతో జడ్పీ బడ్జెట్ ఆమోదం**
**2026-27లో ఆదాయం అంచనా రూ.2,140 కోట్లు.. ఖర్చు రూ.2,123 కోట్లు**
**జిల్లా పరిషతలో భవనాల ఆధునికీకరణకు రూ.1.10 కోట్లు**




క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 22, మచిలీపట్నం : వేసవిలో తాగునీటి సమస్యలను తీర్చేందుకు అధికారులు సరైన విధంగా స్పందించాలని, నిధులు సకాలంలో విడుదల చేయాలని జడ్పీటీసీ సభ్యులు ముక్తకంఠంతో కోరారు. జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అధ్యక్షతన జిల్లా పరిషత స్టాండింగ్ కమిటీ సమావే శం గురువారం స్థానిక జడ్పీ సమావేశ హాల్లో జరిగింది. ఈ సందర్భంగా కృత్తివెన్ను, గూడూరు, రెడ్డిగూడెం, కలిదిండి తదితర మండలాల జడ్పీటీసీ సభ్యులు మాట్లాడుతూ వేసవిలో ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని నిధులు విడుదల చేయాలన్నారు. అవసరమైన ప్రాంతాల్లో తాగునీటి ట్యాంకర్లను ఏర్పాటు చేయాలన్నారు. కృత్తివెన్ను మండలం చినగొల్లపాలెంతో పాటు ఇతర గ్రామాల్లో చెరువుల నుంచి సరఫరా చేసే తాగునీరు సక్రమంగా ఫిల్టర్ కావట్లేదని, ప్రజలు భయాందోళన చెందుతున్నారని, మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పనితీరు బాగోలేదని కృత్తివెన్ను జడ్పీటీసీ సభ్యురాలు తెలిపారు.

అవనిగడ్డ, పామర్రు ఎంపీడీవోలపై ఫిర్యాదు

పామర్రు, అవనిగడ్డ ఎంపీడీవోలు.. ఆయా మండలాల్లోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో పాటు ఎంపీపీలు, జడ్పీటీసీలను పట్టించుకోవట్లేదని, చులకనగా చూస్తున్నారని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. పంచాయతీల్లో తీర్మానం చేసిన పనులను చేయించ కుండా జాప్యం చేస్తున్నారని, నిధులను కూడా మంజూరు చేయడంలేదని పేర్కొన్నారు. కనీస మర్యాద ఇవ్వకపోగా, పరిపాలనా అంశాలను తెలియజేయట్లేదని వివరించారు. ఎంపీడీవోల పనితీరుపై విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని లేకుంటే, రెండు మండలాల్లోని ప్రజాప్రతినిధులంతా ఏకమై ఏంచేయాలో అదే చేస్తామన్నారు. దీనిపై జడ్పీ సీఈవో కన్నమనాయుడు స్పందిస్తూ ఈ అంశాలపై విచారణ చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సాంఘిక సంక్షేమ శాఖ డీడీ పనితీరు బాలేదు

మొవ్వలోని బాలుర వసతి గృహాన్ని ఇటీవల సంక్రాంతి సెలవుల్లో కూలగొట్టారని, స్థానికంగా ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎలాంటి సౌక ర్యాలు లేకున్నా 95 మంది పిల్లలను అక్కడ ఉంచుతున్నారని జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు పరిశుద్ధరాజు సమావేశంలో వివరించారు. పిల్లలు ఇబ్బందులు పడుతున్న విషయంపై చెప్పేందుకు సాంఘిక సంక్షేమ శాఖ డీడీ షాహిద్‌బాబుకు ఫోన్ చేస్తే 'మీ హోదా ఏంటి?' అని అడుగుతున్నారని, ఏమైనా సమస్య ఉంటే కలెక్టర్‌తో మాట్లాడుకోవాలని ఆయన అంటున్నారని చెప్పారు. మిగిలిన సభ్యులు కూడా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ మాటతీరు బాగోదని, కొన్ని సందర్భాల్లో ఫోన్ కూడా తీయడని ధ్వజమెత్తారు. ఆయనపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, ఈ సమావేశానికి కూడా రాలేదని ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై కలెక్టర్‌తో మాట్లాడతానని జడ్పీ సీఈవో చెప్పడంతో సభ్యులు శాంతించారు. ధాన్యం రవాణాకు సంబంధించిన బిల్లులను మంజూరు చేయించాలని సభ్యులు కోరారు. ఆయా మండలాల్లో రహదారుల అభివృద్ధి పనులను ప్రారంభించే సమయంలో, జడ్పీ నిధులతో పదో తరగతి పిల్లలకు స్టడీ మెటీరియల్ అందించే సమయంలో జడ్పీటీసీలకు కనీస సమాచారం ఇవ్వలేదని సభ్యులు పోడియం ఎదుట ఆందోళన చేశారు.

రూ.120.34 కోట్ల ప్రారంభ నిల్వతో బడ్జెట్ ఆమోదం

జిల్లా పరిషతకు సంబంధించి 2026-27 బడ్జెట్‌ను రూ.120.34 కోట్ల ప్రారంభ నిల్వతో జిల్లా పరిషత చైర్‌పర్సన్ ఉప్పాల హారిక ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్‌ను సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో జడ్పీతో పాటు అనుబంధ శాఖల ఆదాయం రూ.2,140 కోట్లుగా అంచనా వేశారు. ఖర్చు అంచనా రూ.2,123 కోట్లుగా ఉంటుందని అంచనాలు రూపొందించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ నిల్వ రూ.143.97 కోట్లతో ప్రారంభించామని, ఆదాయం రూ.817.82 కోట్లుగా ఉందన్నారు. ఖర్చులు పోనూ రూ.120.34 కోట్ల ప్రారంభ నిల్వతో 2026-27 బడ్జెట్‌ను రూపొందించామని జడ్పీ చైర్‌పర్సన్ తెలిపారు. జడ్పీకి స్వయంగా సమకూరే నిధుల్లో 23 శాతం అభివృద్ధి పనులకు, 15 శాతం ఎస్సీల సంక్షేమం కోసం, ఆరు శాతం గిరిజనుల సంక్షేమం కోసం, 15 శాతం సీ శిశు సంక్షేమం కోసం, తాగునీటి సరఫరాకు 12 శాతం కేటాయించినట్లు తెలిపారు. కార్యాలయ నిర్వహణ కోసం 15 శాతం, అత్యవసర పనుల కోసం నాలుగు శాతం, ఆరోగ్యం, సంక్షేమం కోసం 10 శాతం ని ధులు కేటాయించినట్లు ఆమె తెలిపారు. ఈ సమావేశంలో నూజివీడు సబ్‌కలెక్టర్ వినూత్న, మచిలీపట్నం ఇన్‌చార్జి ఆర్డీవో పోతురాజు, జడ్పీ డెప్యూటీ సీఈవో ఆనందబాబు, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


# సినిమా



## ఐటమ్ సాంగ్స్ చేయడానికి రెడీ..

కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, విలన్ పాత్రలు చేయడానికి కూడా వెనుకాడని నేషనల్ క్రష్ రష్మిక మందన్నా, తాజాగా తన కెరీర్ గురించి కొన్ని సంచలన వ్యాఖ్యలు చేసింది. ముఖ్యంగా అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న 'స్పెషల్ సాంగ్స్' గురించి రష్మిక ఇచ్చిన క్లారిటీ ఇప్పుడు వైరల్ అవుతోంది. ఐటమ్ సాంగ్స్ చేయడానికి తాను సిద్ధమేనని చెబుతూనే, దర్శక నిర్మాతలకు ఒక గట్టి షరతు విధించింది. ఆ షరతు ఏంటి? తన పెళ్లి గురించి వస్తున్న వార్తలకు రష్మిక ఇచ్చిన సమాధానం ఏంటో తెలుసుకుందాం.రష్మిక మందన్న ప్రయాణం 'ఛలో' సినిమాతో మొదలైంది. ఆ తర్వాత వచ్చిన 'గీత గోవిందం' ఆమెను యువత ఆరాధ్య దైవంగా మార్చేసింది. ఇక 'పుష్ప' సిరీస్?తో పాన్ ఇండియా స్థాయిలో నంబర్ వన్ స్టార్?గా ఎదిగింది. తెలుగులో మహేష్ బాబు, అల్లు అర్జున్ వంటి స్టార్ల సరసన నటించిన రష్మిక, ఇటీవల 'గర్ల్ ఫ్రెండ్' అనే లేడీ ఓరియెంటెడ్ సినిమాతో తనలోని నటిని మరోసారి నిరూపించుకుంది.స్పెషల్ సాంగ్స్ -- రష్మిక కండీషన్.. చాలామంది స్టార్ హీరోయిన్లు స్పెషల్ సాంగ్స్ (ఐటమ్ సాంగ్స్) లో మెరుస్తుంటారు. దీనిపై రష్మిక మాట్లాడుతూ.. "నాకు స్పెషల్ సాంగ్స్ చేయాలనే ఉంది, కానీ నాదో చిన్న కండీషన్. ఆ సినిమాలో నేనే హీరోయిన్?గా ఉండాలి, అప్పుడే స్పెషల్ సాంగ్ చేస్తాను. అయితే కొందరు స్పెషల్ డైరెక్టర్ల కోసం మాత్రం నా ఈ షరతును పక్కన పెట్టి సాంగ్స్ చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నాను" అని వెల్లడించింది. తన అభిమానులకు అన్ని జానర్లలో వినోదాన్ని అందించడమే తన లక్ష్యమని ఆమె స్పష్టం చేసింది.ఇండియాలో అత్యధిక పారితోషికం తీసుకునే హీరోయిన్ రష్మికేనని వస్తున్న వార్తలపై ఆమె సరదాగా స్పందించింది. "అందులో ఎలాంటి నిజం లేదు, కానీ ఆ రూమర్ నిజం అవ్వాలని నేను కూడా కోరుకుంటున్నాను" అంటూ నవ్వేసింది. ఇక విజయ్ దేవరకొండతో ప్రేమ, నిశ్చితార్థం మరియు పెళ్లి గురించి అడిగిన ప్రశ్నలకు "సమయం వచ్చినప్పుడు అన్నీ చెబుతాను" అని సమాధానాన్ని దాటవేసింది.

రష్మిక చేతిలో ప్రస్తుతం క్రేజీ ప్రాజెక్టులు ఉన్నాయి. మైసా.. తెలుగులో రాబోతున్న మరో లేడీ ఓరియెంటెడ్ సినిమా. బాలీవుడ్ లో నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం కాక్టెయిల్ 2. అట్లీ-అల్లు అర్జున్ ప్రాజెక్ట్ లో రష్మిక మొదటిసారి విలన్ పాత్రలో కనిపించబోతున్నట్లు సమాచారం. ఒకవైపు కమర్షియల్ సినిమాలు, మరోవైపు ప్రయోగాత్మక పాత్రలతో రష్మిక తన కెరీర్?ను అద్భుతంగా ప్లాన్ చేసుకుంటోంది. ఈ ఏడాది ఆమె పెళ్లి జరిగే అవకాశం ఉందన్న వార్తల మధ్య, సినిమాల విషయంలో ఆమె తీసుకునే నిర్ణయాలు ఎలా ఉంటాయో చూడాలి.





## జామకాయ వీరికి యమ డేంజర్.. తిన్నారో ఈ సమస్యలు ఖాయం..

ప్రకృతి మనకు ప్రసాదించిన అద్భుతమైన సూపర్?ఫ్రూట్స్?లో జామపండు ఒకటి. కేవలం రుచిలో మాత్రమే కాదు పోషకాల విషయంలోనూ ఇది మేటి. జామపండులో విటమిన్ సి, డైటరీ ఫైబర్, పొటాషియం, శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఒక జామపండులో నారింజ కంటే ఎక్కువ విటమిన్ సి ఉంటుంది. ఇది శరీర రోగనిరోధక శక్తిని పెంచి, ఇన్ఫెక్షన్ల నుంచి రక్షిస్తుంది. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు చర్మం ముడతలు పడకుండా కాపాడి, యవ్వనంగా కనిపించేలా చేస్తాయి. అధికంగా ఉండే ఫైబర్ మలబద్ధకాన్ని నివారిస్తుంది. ప్రేగుల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. దీని గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండటం వల్ల షుగర్ ఉన్నవారు మితంగా తీసుకుంటే మేలు జరుగుతుంది. అయితే ఆరోగ్యానికి అమృతంలా పనిచేసే జామపండు.. కొంతమందికి మాత్రం ఇబ్బందులను తెచ్చిపెడుతుంది.జర భద్రం.. వీరు జామపండు తినేటప్పుడు జాగ్రత్త!

ఉబ్బరం -- గ్యాస్ సమస్య ఉన్నవారు

జామలో ఫ్రక్టోజ్, విటమిన్ సి అధికంగా ఉంటాయి. శరీరం గ్రహించగలిగే దానికంటే ఎక్కువ విటమిన్ సి తీసుకున్నప్పుడు అది ప్రేగులలో కిణ్వ ప్రక్రియకు దారితీసి గ్యాస్, కడుపు ఉబ్బరాన్ని కలిగిస్తుంది. ముఖ్యంగా నిద్రపోయే ముందు జామపండు తింటే ఈ సమస్య మరింత పెరుగుతుంది.

మధుమేహం ఉన్నవారు

జామపండు గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండటం వల్ల షుగర్ ఉన్నవారికి ఇది మంచిదే. కానీ అతిగా తింటే మాత్రం రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరగవచ్చు. డయాబెటిస్ ఉన్నవారు రోజుకు 1-2 చిన్న పండ్లకు మాత్రమే పరిమితం అవ్వడం మంచిది.వంటి సున్నితమైన జీర్ణశయాంతర సమస్యలు ఉన్నవారికి జామలోని అధిక ఫైబర్ చికాకు కలిగించవచ్చు. దీనివల్ల కడుపు తిమ్మిరి, విరేచనాలు లేదా అధిక అపానవాయువు వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇలాంటి వారు తొక్క తీసి తినడం లేదా వండిన రూపంలో తీసుకోవడం ఉత్తమం.

తామర లేదా సున్నితమైన చర్మం

జామ ఆకులలోని కొన్ని బయోయాక్టివ్ సమ్మేళనాలు సున్నితమైన చర్మం ఉన్నవారికి అలెర్జీని కలిగించవచ్చు. దీనివల్ల చర్మం ఎర్రబడటం, దురద లేదా మంట రావచ్చు. చర్మ సమస్యలు ఉన్నవారు జామను వాడే ముందు నిపుణుల సలహా తీసుకోవాలి.

ఎలా తింటే సురక్షితం?

జామపండును ఖాళీ కడుపుతో కాకుండా భోజనంతో పాటు లేదా స్నాక్ లాగా చిన్న భాగాల్లో తీసుకోవడం మంచిది. ఏ పండైనా మితంగా తీసుకున్నప్పుడే అది ఔషధంగా పనిచేస్తుంది. మీకు పైన పేర్కొన్న ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉంటే, జామను మీ డైట్?లో చేర్చుకునే ముందు పోషకాహార నిపుణుడిని సంప్రదించండి.



## గోరు వెచ్చని నీటిలో నిమ్మరసం తాగే అలవాటు మీకూ ఉందా

ప్రతి ఉదయం గోరు వెచ్చని నీటిలో నిమ్మ రసం కలిపి తాగడం వల్ల శరీర రోగనిరోధక శక్తి పెరుగుతుంది. వ్యాధులను దూరంగా ఉంచుతుంది. నిమ్మకాయలోని అధిక విటమిన్ సి కంటెంట్ జలుబును నివారిస్తుంది. నిమ్మకాయలో పొటాషియం కూడా పుష్కలంగా ఉంటుంది. ఇది నరాలను ఆరోగ్యంగా ఉంచుతుంది. రక్తపోటును నియంత్రిస్తుంది. శరీర ఆమ్ల స్థాయిని నిర్వహించడానికి కూడా సహాయపడుతుంది. తరచుగా అనారోగ్యానికి గురికాకుండా రక్షణ కల్పిస్తుంది.

నిమ్మ నీరు దంత కుహరాలు, పంటి నొప్పి, చిగుళ్ల నొప్పి వంటి దంత సమస్యలను కూడా తక్షణమే పరిష్కరించగలదు. ఉదయాన్నే ఖాళీ కడుపుతో నిమ్మ నీరు తాగడం వల్ల మూత్రవిసర్జన సైతం మెరుగుపడుతుంది. ఇది శరీరం నుంచి విషాన్ని, వ్యర్థాలను తొలగిస్తుంది. అందువల్ల నిమ్మ రసం తాగడం వల్ల మెరిసే చర్మం పొందవచ్చు. ఇది జీర్ణ సమస్యలను పరిష్కరించడంలో కూడా చాలా ప్రభావవంతంగా ఉంటుంది. ఖాళీ కడుపుతో నిమ్మ నీరు తాగడం వల్ల జీర్ణ శక్తి పెరుగుతుంది. అజీర్ణంతో బాధపడేవారికి ఈ నిమ్మ నీరు అద్భుతంగా పనిచేస్తుంది.

అయితే ఈ నిమ్మకాయ నీటిని తప్పుడు సమయంలో, తప్పుడు మార్గంలో తాగితే ఆరోగ్యానికి విషం మాదిరి ప్రతికూలంగా పని చేస్తుంది. యాసిడ్ రిఫ్లక్స్ వంటి సమస్యలు ఉన్నవారు ఖాళీ కడుపుతో నిమ్మ నీరు తాగడం అంత మంచిది కాదు. నిమ్మ నీరు తాగడం వల్ల దంతాల ఎనామిల్ దెబ్బతింటుందని నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా నోటిలో పుండ్లు ఉంటే నిమ్మ నీటిని తాగడం వల్ల అవి మరింత తీవ్రతరం అవుతాయి.

విషప్రయోగం జరగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

ఎల్లప్పుడూ గోరువెచ్చని నీటిలో నిమ్మరసం కలిపి తాగడం మంచిది. తాగిన వెంటనే పళ్ళు తోముకోకూడదు. రోజుకు ఒకటి కంటే ఎక్కువసార్లు నిమ్మ నీరు తాగకూడదు. ఈ నీటిని నేరుగా తాగడం కంటే స్ట్రా ద్వారా తాగడం వల్ల ఎనామిల్ సురక్షితంగా ఉంటుంది. అల్సర్లు లేదా తీవ్రమైన అసిడిటీ ఉంటే ఈ నీళ్లు అస్సలు తాగకూడదు. అవసరమైతే వైద్యుడిని సంప్రదించడం మరచిపోకూడదు.

## సెలక్టర్లూ..ఇంకా ఎన్ని సెంచరీలు కొట్టాలి?

హైదరాబాద్?లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరుగుతున్న రంజీ ట్రోఫీ మ్యాచ్?లో ముంబై బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ మరోసారి తన విశ్వరూపాన్ని ప్రదర్శించాడు. టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ ఎంచుకున్న హైదరాబాద్ జట్టు మొదట్లో ముంబైని గట్టిగానే దెబ్బతీసింది. కేవలం 82 పరుగులకే ముంబై 3 కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో క్రీజులోకి వచ్చిన సర్ఫరాజ్ ఖాన్, అద్భుతమైన పోరాట పటిమను కనబరిచాడు. ఒత్తిడిలో కూడా ఏమాత్రం తడబడకుండా కేవలం 120 బంతుల్లోనే తన సెంచరీ మార్కును అందుకున్నాడు. అతని ఇన్నింగ్స్?లో 9 ఫోర్లు, 4 భారీ సిక్సర్లు ఉండటం విశేషం.

సర్ఫరాజ్ ఖాన్ ప్రస్తుతం తన కెరీర్?లో అత్యుత్తమ ఫామ్?లో ఉన్నాడని చెప్పడంలో అతిశయోక్తి లేదు. గత కొద్ది నెలలుగా అతను ఆడిన ప్రతి ఫార్మాట్?లోనూ భారీ స్కోర్లు సాధిస్తున్నాడు. గతేడాది డిసెంబర్?లో సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో సెంచరీ బాదిన అతను, ఆ తర్వాత విజయ్ హజారే ట్రోఫీలో గోవాపై 157 పరుగులతో వీరవిహారం చేశాడు. ఇప్పుడు మళ్లీ రంజీ ట్రోఫీలో అదే జోరును కొనసాగిస్తూ 22 జనవరి 2026న హైదరాబాద్?పై సెంచరీతో మెరిశాడు. ఈ సెంచరీతో ముంబై స్కోరును 250 పరుగుల దాటించి జట్టును సురక్షితమైన స్థితిలో నిలబెట్టాడు.

ఫస్ట్ క్లాస్ క్రికెట్?లో సర్ఫరాజ్ ఖాన్ గణాంకాలు చూస్తే ఎవరైనా ఆశ్చర్యపోవాల్సిందే. ఇప్పటివరకు ఆడిన 61 మ్యాచ్?ల్లోనే ఇది అతనికి 17వ సెంచరీ. అంతేకాకుండా 16 హాఫ్ సెంచరీలు కూడా సాధించాడు. 60కి పైగా సగటుతో పరుగులు చేస్తున్న సర్ఫరాజ్, దేశవాళీ క్రికెట్?లో ఒక ఐకాన్?గా మారిపోయాడు. అయినప్పటికీ టీమిండియాలో రెగ్యులర్ ప్లేయర్ గా మారడానికి అతను ఇంకా పోరాడాల్సి రావడం గమనార్హం. గతంలో ఇంగ్లాండ్ సిరీస్?లో మంచి ప్రదర్శన చేసినా, సీనియర్ల రాకతో జట్టులో స్థానం కోసం వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ముందున్న 12 నెలల్లో ఆసియా గడ్డపై భారత్ సుమారు 8 టెస్ట్ మ్యాచ్?లు ఆడాల్సి ఉంది. ఇలాంటి సమయంలో స్పిన్?ను సమర్థవంతంగా ఎదుర్కొనే సర్ఫరాజ్ ఖాన్ వంటి ప్లేయర్ ఫామ్?లో ఉండటం టీమిండియాకు పెద్ద ప్లస్ పాయింట్. కేవలం టెస్టులకే కాదు, పరిమిత ఓవర్ల క్రికెట్?లో కూడా తాను వేగంగా ఆడగలనని ఈ ఇన్నింగ్స్ ద్వారా నిరూపించాడు. సర్ఫరాజ్ నిలకడ చూస్తుంటే సెలక్టర్లు అతడిని ఇకపై విస్మరించడం దాదాపు అసాధ్యమని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



## .బంగ్లా స్థానాన్ని భర్తీ చేయగలదా?

టీ20 ప్రపంచకప్ 2026 ఆరంభానికి ముందే ఒక దేశం టోర్నీ నుంచి తప్పుకోవడం క్రికెట్ చరిత్రలో అరుదైన ఘటన. భారత్?లో తమకు భద్రత లేదని, తమ మ్యాచ్?లను శ్రీలంకకు మార్చాలని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ఐసీసీని కోరింది. అయితే, నిపుణుల నివేదికల ప్రకారం భారత్?లో ఎటువంటి ప్రమాదం లేదని ఐసీసీ తేల్చిచెప్పింది. జనవరి 21 వరకు ఇచ్చిన గడువులోగా బంగ్లాదేశ్ తన నిర్ణయాన్ని మార్చుకోకపోవడంతో, ఐసీసీ బోర్డు ఓటింగ్ నిర్వహించి ఆ జట్టును టోర్నీ నుంచి తొలగించాలని నిర్ణయించింది. దీంతో ర్యాంకింగ్స్, క్వాలిఫైయర్ ప్రదర్శన ఆధారంగా తదుపరి ఉత్తమ జట్టుగా ఉన్న స్కాట్లాండ్?కు ఈ అవకాశం దక్కింది.

నిజానికి స్కాట్లాండ్ జట్టు ఈసారి యూరోపియన్ క్వాలిఫైయర్లలో నాలుగో స్థానంలో నిలిచి నేరుగా అర్హత సాధించలేకపోయింది. కానీ ఐసీసీ నిబంధనల ప్రకారం.. ఏదైనా జట్టు తప్పుకుంటే ఆ ప్రాంతం నుంచి లేదా ర్యాంకింగ్స్ ఆధారంగా మెరుగైన జట్టును తీసుకోవాల్సి ఉంటుంది. స్కాట్లాండ్ ప్రస్తుతం టీ20 ర్యాంకింగ్స్?లో 14వ స్థానంలో ఉండి, క్వాలిఫై కాని జట్లన్నింటిలో అగ్రస్థానంలో ఉంది. దీంతో బంగ్లాదేశ్ ఉన్న గ్రూప్-సి(ఇంగ్లాండ్, వెస్టిండీస్, ఇటలీ, నేపాల్?లతో కూడిన గ్రూప్)లోకి స్కాట్లాండ్ ఎంటర్ కానుంది.

స్కాట్లాండ్?కు ఇలాంటి అదృష్టం వరించడం ఇది మొదటిసారి కాదు. గతంలో 2009 టీ20 ప్రపంచకప్ సమయంలో కూడా జింబాబ్వే జట్టు రాజకీయ కారణాలతో తప్పుకోగా, అప్పుడు కూడా స్కాట్లాండ్? జట్టుకే వైల్డ్ కార్డ్ ఎంట్రీ లభించింది. స్కాట్లాండ్ ఇప్పటివరకు 6 సార్లు టీ20 ప్రపంచకప్?లో పాల్గొంది. 2021లో సూపర్-12 దశకు చేరుకోవడమే ఆ జట్టు అత్యుత్తమ ప్రదర్శన. మొత్తం 22 మ్యాచ్?ల్లో 7 విజయాలు సాధించిన స్కాట్లాండ్, అసోసియేట్ దేశాల్లో బలమైన జట్టుగా పేరు తెచ్చుకుంది. ముఖ్యంగా 2024 వరల్డ్ కప్?లో ఇంగ్లాండ్ వంటి జట్లకు చుక్కలు చూపించిన చరిత్ర స్కాట్లాండ్ సొంతం.

బంగ్లాదేశ్ ప్రభుత్వం, బోర్డు తీసుకున్న ఈ నిర్ణయం ఆ దేశ క్రికెట్?కు పెద్ద దెబ్బ అని విశ్లేషకులు భావిస్తున్నారు. ఐసీసీ నుంచి వచ్చే భారీ నిధులు కోల్పోవడంతో పాటు, భవిష్యత్తులో ఐసీసీ టోర్నీల్లో పాల్గొనడంపై కూడా ఆంక్షలు వచ్చే అవకాశం ఉంది. మరోవైపు స్కాట్లాండ్ ప్లేయర్లు మాత్రం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని భావిస్తున్నారు. కోల్?కతా, ముంబై వేదికలుగా జరగనున్న ఈ మ్యాచ్?లలో స్కాట్లాండ్ ఏ మేరకు రాణిస్తుందో చూడాలి.




Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H No: 21-119, West Ibrahimpatnam, Krishna, Andhra Pradesh - 521456. . Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2844. Ph:9849707349 email:kvp6858@gmail.com